www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

బుధవారం । 18 । మార్చి । 2026





# బిల్లులు చెల్లించి చిన్న పత్రికలను ఆదుకోండి

◆ ఆర్థిక మంత్రి భట్టికి టీయుడబ్ల్యూజే వినతి

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:** చిన్న, మధ్యతరగతి పత్రికలకు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ కోరారు. మంగళవారం రోజు శాసన సభలోని ఛాంబర్ లో టీయుడబ్ల్యూజే ప్రతినిధి బృందం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. దాదాపు రెండేళ్లుగా చిన్న, మధ్యతరగతి పత్రికలకు బిల్లులు చెల్లించక పోవడంతో పడరాని తిప్పలు పడుతున్నారని, కనీసం కుటుంబంతో ఆనందంగా పండగ కూడా జరుపుకోలేని పరిస్థితిని అనుభవిస్తున్నారని విరాహత్ అలీ మంత్రి దృష్టికి తెచ్చారు. ఒక్క పెద్ద పత్రికకు చెల్లించే బిల్లుతో, వందలాది చిన్న, మధ్యతరగతి పత్రికలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్థిక శాఖలో పెండింగులో

మిగతా 2లో..

# రాజకీయ ఈర్ష్య ద్వేషానికి నిదర్శనం

**సీఎం రేవంత్ కు హరీష్ రావు ఘాటు లేఖ**



**సిద్దిపేట, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాజకీయాల్లో సిద్దిపేట అభివృద్ధి అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీష్ రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు బహిరంగ లేఖ రాస్తూ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సిద్దిపేట నియోజకవర్గంపై ప్రభుత్వం కక్షపూరిత వైఖరితో వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ పలు ప్రశ్నలను ఆయన లేఖలో లేవనెత్తారు... హరీష్ రావు లేఖలో ముఖ్యంగా ప్రస్తావించిన అంశం గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సిద్దిపేట అభివృద్ధి కోసం మంజూరు చేసిన రూ. 1,070 కోట్ల నిధుల రద్దు. ఈ నిర్ణయం వెనుక ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ నిధుల రద్దు కారణంగా 13 రకాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, దీని ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోందని ఆయన పేర్కొన్నారు. సిద్దిపేట ప్రజల ఆకాంక్షలను పక్కన పెట్టి తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ

మిగతా 2లో..

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

**కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్, అక్షిత బ్యూరో :** మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమిష్టి కృషితో డ్రగ్స్ రహిత కరీంనగర్ గా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో మాధకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాన్షియస్ నెస్ క్లబ్బులు చురుగ్గా పనిచేసే విధంగా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని పలు సంక్షేమ శాఖ అధికారులను కూడా డ్రగ్స్ నివారణ కార్యక్రమాల్లో, సమావేశాలు భాగస్వాములను తెలిపారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రగతి ప్రణాళికలను డ్రగ్స్ నిర్మూలన ఒక ముఖ్యమైన అంశమని తెలిపారు. అందుకు తగిన రీతిలో కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలోని యాంటీ డ్రగ్ కమిటీలు చురుగ్గా పనిచేస్తున్నాయని తెలిపారు. వివిధ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామని అన్నారు. ప్రజా రవాణా ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ డ్రగ్స్ నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిషేధిత ఇంజక్షన్లు, టాబ్లెట్లు వినియోగించినా, సరఫరా చేసిన బాధ్యులపై క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో గత రెండు నెలల్లో డ్రగ్ సంబంధిత కేసులు 3 నమోదు కాగా ఆరుగురిని అరెస్టు చేశారు. 578 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుతో పాటు రాజేంద్రప్రసాద్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్ కీలకం

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- వార్తలాప్ వర్క్ షాప్‌తో జర్నలిస్టులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన
- పిఐబి అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్



**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** ప్రస్తుత డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందని

మిగతా 2లో..

# సామాన్యుల్లో ధర దడ

- యుద్ధ ప్రభావంతో పెరుగుతున్న నిత్యావసర ధరలు
- దిగుమతి అయ్యే వస్తువులపై రవాణా భారమే కారణం
- ఆందోళనలో పేద మధ్యతరగతి ప్రజలు





**కాజీపేట్, అక్షిత న్యూస్ :** పశ్చిమసియా దేశంలో జరుగుతున్న యుద్ధం వలన సామాన్యుడిపై ప్రభావం చూపుతుంది. క్రూడ్ ఆయిల్ రవాణాలో ఆటంకాలు నేపథ్యంలో ఇప్పటికే గ్యాస్ ధరలు పెరిగి గృహ బడ్జెట్ కు భారంగా మారాయి. సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌పై రూ. 60, కమర్షియల్

మిగతా 2లో..

# సామాన్యుల్లో ధర దడ

(మొదటిపేజీ తరువాయి)

సిలిండర్‌పై రూ.114, వరకు ధర పెరగడంతో పేద మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద భారంగా మారింది. వంట నూనె ధరలు కూడా మండిపోతున్నాయి. సన్ ఫ్లవర్, పామాయిల్ తదితర నూనెల దిగుమతులకు అంతరాయం కలగడంతో ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. గతంలో లీటరు






రూ.155 ఉన్న సన్ ఫ్లవర్ ఆయిల్ ప్రస్తుతం రూ. 170 కీ, 5 లీటర్ల క్యాన్ రూ. 780 నుంచి రూ. 880 కీ చేరింది. పామ్ ఆయిల్ ప్యాకెట్ రూ. 111 నుంచి రూ. 120 కీ పెరిగాయి.

### నిత్యవసరాలపై ప్రభావం ....

ఒక వైపు నూనె ధరలు పెరుగుతుండగా మరోవైపు వెల్లుల్లి, వేరుశనగ పలుకుల ధరలు వినియోగదారులకు మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కిలో వేరుశనగ రూ.120 నుంచి రూ.165కు పెరిగింది. వెల్లుల్లి ధర రూ.120 నుంచి రూ.150 కి ఎగబాకింది. దీంతో పల్లీలతో తయారయ్యే ఉత్పత్తుల ధరలపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గ్యాస్ ఆధారిత తయారీ వస్తువులైన ప్లాస్టిక్,మినీ వాటర్ గ్లాస్, కవర్ల ధరలపై కూడా ప్రభావం చూపుతుంది. దీని వలన చిన్న వ్యాపారులకు, రిటైల్ వ్యాపారులకు ఇబ్బందికరంగా మారింది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్ బుకింగ్ తేదీలను పెంచడం కూడా వినియోగదారులకు భయాన్ని కలిగిస్తున్నాయి. ఇదే అదనగా చూసుకొని గ్యాస్ ఏజెన్సీలు బ్లాక్ మార్కెట్లో గ్యాస్ ను హిస్టారీతిన అమ్ముకుంటున్నారు. అధికారులు అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తూ ఎక్కడో ఒకచోట కేసులు బుక్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. బుక్ చేసిన పది పదిహేను రోజులకు కానీ గ్యాస్ అందడం లేదు గ్యాస్ అయిపోయాక పట్టణాల్లో 25 రోజులు పల్లెల్లో 40 రోజుల వరకు గ్యాస్ బుక్ కావడం లేదు ఇదే తరహా పరిస్థితిలు కొనసాగితే మనిషి పూర్వపు లాగే కట్టెలను ఆశ్రయించి పల్లెలకు పరుగుపెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

## బిల్లులు చెల్లించి చిన్న పత్రికలను ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న బిల్లుల ఫైలును వెంటనే క్లియర్ చేయాలని ఆయన కోరగా, భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్యాల్కి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని కిరణ్ కుమార్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

## రాజకీయ ఈర్ష్య ద్వేషానికి నిదర్శనం

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలో ఉన్నప్పుడూ సిద్ధిపేటపై సీఎం రేవంత్ రెడ్డి వైఖరి ఒకే విధంగా ఉందని, ఇది రాజకీయ ఈర్ష్య, ద్వేషానికి నిదర్శనమని హరీష్ రావు విమర్శించారు. గతంలో సిద్దిపేట అభివృద్ధిపై చేసిన వ్యాఖ్యలను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారని, వాటిని వారు మరచిపోలేదని అన్నారు. ఇంకా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేటలో ఒక్క కొత్త అభివృద్ధి పనైనా ప్రారంభించిందా అని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పరంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటో ప్రజలకు తెలియజేయాలని కోరారు. సిద్దిపేట వంటి అభివృద్ధి చెందిన నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ప్రాజెక్ట్‌పై కూడా హరీష్ రావు స్పందించారు.

ఆ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు ప్రణాళికలు అన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే సిద్ధమయ్యాయని ప్రస్తుతం ప్రభుత్వం కేవలం ప్రారంభోత్సవం మాత్రమే చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఇది ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని అన్నారు. సిద్దిపేటలో పర్యటించాలనుకుంటే ముందుగా రద్దు చేసిన నిధులను పునరుద్ధరించాలని, నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా పర్యటనలు చేయడం వల్ల ఉపయోగం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ లేఖతో సిద్దిపేట అభివృద్ధి అంశం మరోసారి రాజకీయంగా వేడెక్కింది. బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీల మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు మరింత ముదురే అవకాశముంది. హరీష్ రావు లేఖపై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# గ్రానైట్ అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు




**ఖమ్మం/అక్షిత బ్యూరో:** చైనా లోని జీయామిన్‌లో జరుగుతున్న గ్రానైట్ ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ ను రాష్ట్ర చిన్న తరహా గ్రానైట్ పరిశ్రమల అధ్యక్షుడు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సందర్శించారు. అధునాతనమైన గ్రానైట్ కటింగ్ పాలిసింగ్‌కు సంబంధించిన మిషనరిని పరిశీలించారు.వాటిని ఉపయో గించే మార్గిమెంట్స్ తయారీ విధానాన్ని పరిశీలించారు.

## డిజిటల్ యుగంలో
# ఫ్యాక్ట్ చెకింగ్ కీలకం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కృత్రిమ మేధస్సు ద్వారా తయారవుతున్న కంటెంట్, తప్పుదారి పట్టించే చిత్రాలు, తప్పుడు సమాచారాన్ని గుర్తించి నిజమైన వార్తలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఆమె అన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వార్తలాప్ పేరుతో జర్నలిస్టులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగ ఆధారిత హింస, మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జర్నలిజంలో కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్‌తో





కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు 130 మంది జర్నలిస్టులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందన్నారు. చిన్న తప్పుదారి పట్టించే సమాచారం కూడా సమాజంలో భయం, ప్రజల నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు.మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంలాంటిదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలసీలు, పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఆమె అన్నారు. జర్నలిస్టులు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన వార్తలను అందించాలని సూచించారు. ఈ తరహా వర్క్‌షాప్‌లు జర్నలిస్టులు నూతన పరిజ్ఞానాన్ని తెలుసుకుని తమ వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల అధికారిక సమాచారాన్ని ప్రజలకు ఖచ్చితంగా చేరవేయడంలో పీఐబీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న ఈ కాలంలో తప్పుడు వార్తలను గుర్తించి ఖండించడంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ముఖ్యమైన బాధ్యత నిర్వర్తిస్తున్నదని తెలిపారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. లింగ సమానత్వం, మహిళల సంక్షేమ పథకాలపై సీనియర్ జర్నలిస్టు సజయ కాకర్ల మాట్లాడుతూ, లింగ సమానత్వం కుటుంబం నుంచే ప్రారంభం కావాలని, పిల్లల్లో సరైన దృక్పథాన్ని తల్లిదండ్రులు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై అవగాహన కల్పించడంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకమని చెప్పారు.

జర్నలిజంలో ఏఐ వినియోగంపై సత్యప్రియ వివరించారు. నోట్‌బుక్ కేఎల్ఎం, చాట్ జీపీటీ, గూగుల్ పిన్‌పాయింట్, ఎలెవన్ లాబ్స్, జెమినీ ఏ ఐ వంటి పలు ఏ ఐ సాధనాలను ఎలా ఉపయోగించాలో వివరించారు. అయితే ఏఐ వేదికలపై వ్యక్తిగత లేదా సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్క్‌షాప్ ముగింపులో జర్నలిస్టులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు పిఐబి అదనపు డైరెక్టర్ జనరల్ సమాధానాలు ఇచ్చి, వారి సూచనలు, అభిప్రాయాలను సంబంధిత మంత్రిత్వ శాఖలకు చేరవేస్తామని హామీ ఇచ్చారు.

# అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

### మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్

### నర్సంపేటలో మెగా గ్యాస్ ఆధ్వర్యంలో బహిరంగ విపత్తు నిర్వహణ శిక్షణ

**నర్సంపేట, అక్షిత ప్రతినిధి:** పరిశ్రమలు, నివాస ప్రాంతాల్లో ఇంధన వాయువు లీకేజీ వంటి ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణ, ఆస్తి నష్టాన్ని కనిష్ట స్థాయికి తగ్గించుకోవాలని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో మెగా గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బహిరంగ విపత్తు నిర్వహణ శిక్షణ' (ఆఫ్-సైట్ మాక్ డ్రిల్) కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. గ్యాస్ లీకేజీ లేదా అగ్నిప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో ప్రజలు భయాందోళనకు గురికాకుండా సురక్షితంగా బయటపడేందుకు ఇటువంటి కృత్రిమ శిక్షణలు ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు. మెగా గ్యాస్ సంస్థ ప్రాంతీయ నిర్వాహకులు అవినాష్, నిర్వహణ-పర్యవేక్షణ






విభాగం ప్రతినిధి రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలు పౌరుల్లో భద్రతా స్పృహను కల్పిస్తాయని కొనియాడారు. విపత్తు సమయాల్లో రక్షక భట, అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం పెరగడానికి ఇటువంటి కార్యక్రమాలు దిక్సూచిగా నిలుస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, పట్టణ ఉపనిరీక్షకులు గూడ అరుణ్, మున్సిపల్ కౌన్సిలర్లు ఎలకంటి విజయ్ కుమార్, మాదాసి రవి, పొన్నాల మనీషా, ములుకల వినోద, కొంపల్లి వీణ, వేల్పుల శ్రీలత, ఇస్లావత్ రామ తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో 80 ఫీట్ల రోడ్డు పనులు ప్రారంభం

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి యుఐడిఎఫ్ పథకం కింద రూ. 18.70 కోట్లు మంజూరు కాగా, టెండర్లు పూర్తయ్యాయి. ఈ నిధులతో రోడ్ల అభివృద్ధి, మురికి కాలువలు, మౌలిక వసతుల పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రోడ్ల వెడల్పు కార్యక్రమం ప్రారంభమై, సోమవారం అధికారులు మార్కింగ్ నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి ఎంజీ రోడ్ గుండా ఫ్లైఓవర్ కు రెండు వైపులా పాత రైల్వే గేట్ వరకు 80 ఫీట్ల రోడ్డు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



అలాగే రాజీవ్ చౌక్, తిరందాజ్, అంబేద్కర్ చౌక్, పొట్టి శ్రీరాములు, సంజీవయ్య కాలనీ అండర్ బ్రిడ్జ్ వరకు మరియు సర్ సిల్క్ చౌరస్తాల్లో రోడ్లు విస్తరించనుండడంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి వాహనదారులకు ఉపశమనం కలగనుంది.

## ఈద్గా వద్ద ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** ముస్లింల పవిత్ర పండుగ ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)ను పురస్కరించుకొని ఈద్గా మైదానం వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గజానంద్, కౌన్సిలర్ సాలం బిన్ అహ్మద్ తోకలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈద్గా పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సిబ్బందితో కలిసి తొలగింపజేశారు. రంజాన్ పండుగ నమాజ్ కోసం వచ్చే



భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఆకాష్ , వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ తెలిపారు. ముఖ్యంగా మంచినీటి సదుపాయం, పరిసరాల శుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ యంత్రాంగం పండుగ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి మైదానాన్ని సిద్ధం చేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాలలో వీధిలైట్లు పగటిపూట వెలగకుండా నియంత్రించాలి

**- కలెక్టర్ హరిత**

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలోని గ్రామ పంచాయతీలలో, మున్సిపాలిటీలలో పగటిపూట విద్యుద్దీపాలు వెలుగకుండా నియంత్రించాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట, పాడి బండ గ్రామ పంచాయతీలను కలెక్టర్ సందర్శించి, పగటిపూట వీధి దీపాలు వెలుగుతుండడాన్ని గమనించి స్థానిక పంచాయతి కార్యదర్శిని పిలిచి వీధి దీపాలు వెలుగుతుండడానికి గల కారణాలను అడిగి



తెలుసుకొని వెంటనే విద్యుత్ తీగలు మరమ్మత్తులు చేపట్టి నియంత్రణ బోర్డులు బిగించాలని సూచించారు.జిల్లా పంచాయతి అధికారి భిక్షపతి గౌడ్‌కు ఫోన్ ద్వారా జిల్లాలోని గ్రామపంచాయతీలలో, మున్సిపాలిటీలలో పగటిపూట విద్యుత్ దీపాలు వెలుగకుండా చర్యలు తీసుకోవాలని,ఈ సమాచారాన్ని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మరియు మున్సిపల్ అధికారులకు వాట్సప్ ద్వారా సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతి పరిధిలోని పారిశుద్యం పై శ్రద్ధ వహించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలి

### తహశీల్దార్‌కు బీజేపీ మండల నాయకుల వినతి

**నర్సంపేట అక్షిత ప్రతినిధి:**
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నెక్కొండ మండల బీజేపీ నాయకులు మంగళవారం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. మండల అధ్యక్షురాలు నాయిని అనూష అశోక్ నేతృత్వంలో తహశీల్దార్ కార్యాలయంలో ఈ విన్నపం అందజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, రైతు భరోసా వంటి కీలక వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా అందక రైతులు పెట్టుబడుల కోసం అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నిలిచిపోయిన ఆసరా పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని, కళ్యాణ లక్ష్మి, గృహ నిర్మాణ పథకాల లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు సమర్పించిన భూ సమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యం వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు నష్టపోతున్నారని, నిర్ణీత



సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని విన్నవించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధిదీపాల వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు దామచర్ల రామారావు, శ్రీరంగం సంపత్, ప్రధాన కార్యదర్శి రాంపల్లి రాజగోపాల్, సీనియర్ నాయకులు తాళ్లూరి లక్ష్మయ్య, అంబాల రామ్ గోపాల్, పనికెర మాజీ సర్పంచ్ పింగిలి మోహన్ రెడ్డి, బీసీ మోర్చా మండల అధ్యక్షులు జమ్ముల సుధాకర్, కుడికాల సుధీర్, మల్లం మల్లేష్, బొమ్మనపల్లి జయప్రకాష్, కొర్రబాలు, కుమార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ మొట్టే కుర్మయ్య

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:**
పెద్దకొత్తపల్లి మండలం నక్కలపల్లి గ్రామములో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లి మండలం, నక్కలపల్లి గ్రామములో మంగళవారం ఉదయం ఉచిత గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మొట్టే కుర్మయ్య ప్రారంభిమాచారు. అలాగే గ్రామ రైతులు పెద్ద ఎత్తున పశువులకు టీకాలు వేయించుకున్నారు. పశువైద్య అధికారులు పశువులకు టీకాలు వేయించుకుంటే వ్యాధులు రాకుండా ఉంటుందన్నారు. పశువుల పట్ల రైతులు వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలి అని అన్నారు.ఎవరైన మిగిలిపోయి ఉంటే ఫోన్ ద్వారా సంప్రదించాలని వైద్య అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మేకల మల్లేష్, వార్డు సభ్యులు



చిన్న నరసింహ, బండి కమలమ్మ మహేష్ గ్రామ పెద్దలు ఈశ్వరయ్య, భాస్కర్ రెడ్డి, దస్తగిరి, విష్ణు, చంద్రయ్య,ఈశ్వర్, శివ శ్రీనివాస్ రెడ్డి సనసుల్లాన, వెటర్నరీ అసిస్టెన్స్ నిరంజన్ ,గోపాల మిత్ర మారేడు యాదగిరి, ఓ ఎస్ రాజు పాల్గొని పశువులకు వైద్యం అందజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ కాన్పులు పెంచాలి

### పిహెచ్‌సిలలో నిర్వహించే మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య నిపుణులచే ప్రతి పి హెచ్ సి లో మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని, అందుకు ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు పి హెచ్ సి లో నిర్వహించిన మెడికల్ క్యాంపును ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ మెడికల్ క్యాంపుల ద్వారా జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్,గైనకాలజీ, ఆర్థోపెడిక్,ఆప్తమాలజీ,మహిళలకు గర్భాశయ ముఖ క్యాన్సర్ ను గుర్తించే టాప్ స్మెయర్,కంటికి సంబంధించి కాంట్రాక్ట్ లోపం,బిపి, షుగర్,చిన్న పిల్లల్లో ఎత్తు, పోషకాహార లోపాలకు చెందిన వైద్య నిపుణులు రోజుకొక్క పి హెచ్ సి కి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి,మందులను ఉచితంగా అందించటంతో పాటు ఆరోగ్యం మెరుగు పడేలా పలు సూచనలు ఇస్తారని కలెక్టర్ తెలిపారు.ఇంకా శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చిన,మెరుగైన వైద్యం కోసం జనరల్ హాస్పిటల్ కి రిఫర్ చేయటం జరుగుతుందని



చెప్పారు.మెడికల్ క్యాంపులో 300 మంది ఓపిలో నమోదు అయ్యారని తెలిపారు.మెడికల్ క్యాంపు నిర్వహిశీచిన తీరుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా పి హెచ్ సి లలో సాధారణ ప్రసవాలు పెరిగేలా ప్రజలను ఆహాగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.



### ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్

మేళ్లచెర్వు మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ లో కలెక్టర్ హాస్టల్ లోని గదులను,వంట గదిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.ప్రతి రోజు వంట బాగుంటుందా...? మెను ప్రతి రోజు అమలు చేస్తున్నారా...? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి వార్షిక పరీక్షలలో ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్ట్ లో కనీసం 70 శాతానికి పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.ఈ సమయంలో కలెక్టర్ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ మాధవ్ కుమార్,డా.సుధాకర్ నాయక్,వైద్యులు యస్వంత్, మణి, ప్రజ్ఞ, సాయి శ్రీ, వెంకటేష్, సమీర, మెడికల్ అధికారి, వైస్ ప్రిన్సిపాల్ మధు,ఇన్చార్జి తహసిల్దార్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ బచ్చు పద్మావతి, ఉప సర్పంచ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

## అభివృద్ధి సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, ప్రణాళికల రూపకల్పనలో

# జనాభా గణన ఉపయోగ పడుతుంది

### - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా





**మహబూబ్ నగర్, అక్షిత బ్యూరో:** అభివృద్ధి సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, ప్రణాళికల రూపకల్పనలో జనాభా గణన ఉపయోగ పడుతుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో చార్జి అధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నిర్వహిస్తున్న తొలి జనగణన అని, 2011 జనాభా గణన తర్వాత 2021లో నిర్వహించ వలసిన ఈ ప్రక్రియ కోవిడ్ కారణంగా ఆలస్యంగా జనాభా గణన 2027 లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గత కొన్ని సంవత్సరాలలో జనాభా పరంగా, పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. జన గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్,హౌస్ ఎన్యూమరేషన్), గృహాల గణన, తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని, రెండవ దశలో జన గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు.

ఈ సంవత్సరం జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అంటే ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణం (కచ్చా పక్కా,తదితర,) ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు.

జనాభా లెక్కలు సేకరించడం ఒక ముఖ్యమైన బాధ్యతతో పాటు సవాలుతో కూడుకున్న పని అని ఆమె పేర్కొన్నారు. అందుకు అధికారులు శిక్షణ లో తెలియచేసే ప్రతి విషయాన్ని అవగాహన చేసుకోవాలని,ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని తప్పకుండా గణనలో చేర్చాలని అధికారులకు ఆమె ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుండి ఉపాధి కోసం వచ్చిన వలస కూలీలను కూడా గణనలో చేర్చి వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు.

ఫీల్డ్ స్థాయిలో కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, పైస్థాయి అధికారులతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరించుకుని జనగణనను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ కార్యాలయం ఏ.డి.రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రెవెన్యూ గ్రామాలను, పట్టణాల్లోని వార్డులను సి.ఎం.ఎం.ఎస్ పోర్టల్ ద్వారా హౌస్ లిస్టింగ్, ఎన్యూమరేషన్ చేయడం ,స్వయంగా చేయడం శిక్షణలో వివరించారు

జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు సమన్వయంతో జన గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు

ఈ కార్యక్రమంలో జడ్.పి. సి.ఇ.ఓ,ఇంచార్జి డి.పి.ఓ వెంకట రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్,జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా మాస్టర్ ట్రైనర్ బాలు యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన విధుల్లో సీనియారిటీ పాటించాలి : జాన్ నాయక్

### నెక్కొండ తహశీల్దార్‌కు డీటీఎఫ్ విజ్ఞప్తి




**నర్సంపేట, అక్షిత ప్రతినిధి:** రాబోయే మే 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జనాభా గణన ప్రక్రియలో ఉపాధ్యాయులకు కేటాయించే విధుల్లో ఖచ్చితంగా సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘం (డీటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్ జాన్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నెక్కొండ తహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారికి సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాన్ నాయక్, మండల శాఖ అధ్య క్షులు బాలాజీ మాట్లాడుతూ జనగణన విధుల్లో గణనకర్తలు (ఎన్యు మరేటర్లు), పర్యవేక్షకుల (సూపర్‌వైజర్ల) నియామకం పూర్తిగా ఉపా ధ్యాయుల సర్వీసు ప్రాధాన్యత ప్రకారమే జరగాలన్నారు. గత గణన సమయంలో నియామకాల్లో అనేక అవకతవకలు జరిగాయని, ఈసారి ఎలాంటి పైరవీలకు తావులేకుండా పారదర్శక విధానాన్ని అవలంబించాలని కోరారు. సీనియర్ ఉపాధ్యాయుల అనుభవాన్ని గుర్తించి వారికి తగిన బాధ్యతలు అప్పగించాలని, నిబంధనలు అతిక్రమిస్తే క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల,అక్షిత న్యూస్:** జిల్లాలోని ఈవీఎం గోడౌన్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల నెలవారి తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్ రిజవాన్ బాషా షేక్ ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచి తనిఖీ చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



# నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు - సృజన అభినందన

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ప్రముఖ సాహిత్యకారుడు నందిని సిధారెడ్డి రాసిన అనిమేష కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించడం పట్ల సృజన సాహితీ సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిధారెడ్డి ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాహిత్యకారునిగా పేరు గడించారని,ఆయనకు లభించిన అవార్డు తెలుగు వారికి దక్కిన గౌరవంగా సృజన నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిధారెడ్డితో సృజనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ అనేక సదస్సులలో ఆయనతో కలసి పాల్గొనే అవకాశం లభించిందని అన్నారు.సృజన నిర్వాహకులు రామకృష్ణ, గట్టే వాసు,ఆడమ్స్,మధుసూదన రాజు, పసుపులేటి నాగేశ్వరరావు సిధారెడ్డికి అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

# ఇమాంలకు మౌజాం ఈద్ తోఫా పంపిణీ చేసిన డిప్యూటీ మారేపల్లి సురేందర్ రెడ్డి

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ కార్పొరేషన్ పరిధిలోని మస్జిదుల ఇమాంలకు మరియు మౌజాం ఈద్ తోఫా పంపిణీ చేసిన మహబూబ్ నగర్ డిప్యూటీ మారేపల్లి సురేందర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో చేసే ఉపవాస దీక్షలతో మీ పార్థనలు నెరవేర్చాలని ప్రార్థిస్తున్నాను మనం అందరం కుల మతాలకు




అతీతంగా అన్ని పండుగలు జరుపుకోవాలి ఆకాంక్షించారు. మీరు అందరూ ఇమాంలు, మౌజాంలు రోజుకి 5 పుటలు నమాజ్ చేసే మీరు అందరూ నా ఆహ్వానని మన్నించి రావడం ఎంతో ఆశీర్వాదంగా భావిస్తున్నాని అన్నారు.ఎల్లప్పుడూ మీకు అండగా నిలిచి మీ సంక్షేమానికి మీ సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టాక్కీఉద్దీన్, కార్పొరేటర్లు, అన్వర్ భాయ్,మెసి,ఉమర్, మోసిన్,రఫీ పటేల్,జాకీ భాయ్, మస్జిద్ల సదర్సులు,మౌళనలు,కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు, మత పెద్దలు,కాంగ్రెస్ నాయకులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అధికారుల సూచనలతో రైతులు మంచి దిగుబడులు సాధించాలి

**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** జిహెచ్ఎంసి పరిధి కిష్టాపూర్ – పూడూర్ డివిజన్ లోని పూడూర్ లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులకు మేడ్చల్ వ్యవసాయ శాఖ ఏఈవో తేజస్విని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, రైతులు మాధవరెడ్డి, సింగరేణి పోచయ్య, సత్తిరెడ్డి, శేఖర్ రెడ్డి, కోల వెంకటేష్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





## జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్న వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్

**గద్వాల, అక్షిత న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రసిద్ధిగాంచిన జమ్ములమ్మ అమ్మవారిని వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ కుటుంబ సమేతంగా భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీ పురేందర్ చైర్మన్‌ని సన్మానించారు. ఆలయ విశేషాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి చైర్మన్‌కి వివరించారు. చైర్మన్ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ దర్శన కార్యక్రమంలో బీచుపల్లి కుటుంబ సభ్యులు మరియు స్థానిక భక్తులు కూడా పాల్గొన్నారు.

## ఒకే రోజు ఆరు సాధారణ కాన్పులు

**గద్వాల, అక్షిత న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ జి. చంద్రకళ నేతృత్వంలో ఒకే రోజు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గర్భిణీ స్త్రీలకు ఆరు సాధారణ కాన్పులను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిఎంహెచ్ఓ మరియు మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ ఆదేశానుసారం ప్రాథమిక



ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి గర్భిణీ స్త్రీలకు 99 శాతం నార్మల్ డెలివరీలు చేయాలి మిగిలిన 1% జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. ఉన్నతాధికారుల సలహాల సూచనలను మేరకే సాధారణ కాన్పులు చేయడం సాధ్యమైందని అన్నారు.ఈ విషయమై ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ మరియు సిబ్బంది ఆమెను అభినందించారు. ఈ విషయం డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగన్న వైద్య సేవలకు ఇది నిదర్శనమని అన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున నార్మల్ డెలివరీలు మా సిబ్బంది చేస్తున్నారు. జిల్లాలోనే ఎన్నో సార్లు ముందుండి అవార్డులు అందుకున్నారని గుర్తు చేశారు.

## పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూత

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం జిల్లా కొణిజర్లకు చెందిన నిరుపేద మైనారిటీ విద్యార్థి ఉన్నత విద్యకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూతగా నిలవడం అభినందనీయమని ఖజానా శాఖ ఉపసంచాలకులు వై శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు కలెక్టరేట్ లోని ఖజానా శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో షేక్ ఉస్మాన్‌కు పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూతగా అందించిన ఇరవై వేల రూపాయల చెక్కును అందజేసి అభినందించారు.

కొణిజర్లకు చెందిన నిరుపేద మైనారిటీ వర్గానికి చెందిన షేక్ హసన్ అబ్బాస్బీ దంపతుల కుమారుడు ఉస్మాన్ మధ్యప్రదేశ్ లో ఫోరెన్సిక్ డిగ్రీ చదువుతుండగా ఆర్థిక చేయూత కై పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ను సంప్రదించారు.



కుటుంబ ఆర్థిక పరిస్థితులు నేపధ్యంలో ఆర్థిక చేయూత కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ అంగీకరించి ఆమేరకు చేయూత గా చెక్కు అందజేసింది. ఖజానా శాఖ కార్యాలయంలో ఉప కోశాధికారులు బి నాగేంద్రకుమారి మోదుగు వేలాద్రి బి శారద వై మంజుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య విశ్రాంత యంపిఓ డిలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.







# 14 సంవత్సరాల లోపు బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్ అందించాలి : కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలో 9 నుండి 14 సంవత్సరాల లోపు గల బాలికలకు ప్రతి ఒక్కరికి హెచ్.పి.వి.వ్యాక్సిన్ అందించాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం తిర్యాని మండల కేంద్రంలోని చింతపల్లిలో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను నీతి అయోగ్ కేంద్ర ప్రతినిధి అశ్ల శర్మతో కలిసి కలెక్టర్ అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, రోగుల వార్డులు, మందుల నిల్వల గదిని, ప్రసూతి పట్టికను, పరిశీలించి నెలలోఎన్ని ప్రసుతీలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చేవారినికి శుద్ధ జలం అందించే ఆర్ ఓ ప్లాంట్ ను వెంటనే మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఆసుపత్రికి చికిత్స కొరకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని 14 సంవత్సరాల లోపు బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్ అందించాలన్నారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో సంపూర్ణత అభియాన్‌లో భాగంగా పశువులకు ఉచితంగా గాలికుంటు నిరోధిక టీకాలు అందించే కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో 100 శాతం పశువులకు టీకాలు వేయాలన్నారు. ప్రతిరోజు మూడు గ్రామాల చొప్పున టీకాలు అందించే కార్యక్రమం చేపట్టాలన్నారు. అనంతరం మండలంలోని విజయనగరం కాలనీలో నిర్మిస్తున్న జంగుబాయి మండల సమాఖ్య భవనంను పరిశీలించి, భవన పనులు 90 శాతం వరకు పూర్తయినవి అని, మిగిలిన డోర్లు, కిటికీలు, బిగించే పనులు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించి త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. మండలంలోని మహిళా సంఘాలు మండల సమాఖ్య సమావేశాలు నిర్వహించుటకు ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మండల సమైఖ్య సభ్యులు జిల్లా కలెక్టర్ గారిని నీతి అయోగ్ కేంద్ర ప్రతినిదిని శాలువాలతో సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి, రమాదేవి, తిర్యాని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, వేముల మల్లేష్, ఎ.పి.ఎం శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది, సంపూర్ణత అభియాన్ జిల్లా సమన్వయ,కర్త బాల రాజు, మండల సమాఖ్య సబ్యులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# సహజ వ్యవసాయంపై రైతులకు శిక్షణ

### అధిక పురుగు మందుల వాడకం
### ప్రజల ఆరోగ్యాలకు హానికరం : జిల్లా కలెక్టర్

**వరంగల్, అక్షిత బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సంపేట మండలం రాజుపేట గ్రామంలోని రైతు వేదికలో సహజ వ్యవసాయం (నేచురల్ ఫార్మింగ్)పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై రైతులనుద్దేశించి మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు అవగాహన, శిక్షణ చాలా అవసరమని పేర్కొన్నారు. సహజ వ్యవసాయం ద్వారా పంటల ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా తగ్గడంతో పాటు భూమి సారాన్ని సంరక్షించుకోవచ్చని తెలిపారు.

ఎక్కువగా పురుగు మందులు ఎరువులు వాడడం వల్ల ఆరోగ్య సమస్యలకు వస్తున్నాయని, వాటి నివారణకు పురుగు మందులు లేని నాణ్యమైన ఆహారం అవసరమని తెలియజేశారు. రసాయనాల



వినియోగాన్ని తగ్గించి, సహజ పద్ధతులను అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పెంచవచ్చని రైతులకు సూచించారు. అనంతరం రైతులకు సహజ వ్యవసాయం కోసం అవసరమైన నేచురల్ ఫార్మింగ్ కిట్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జెడి అగ్రికల్చర్ అనురాధ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్ రావు, నర్సంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు దామోదర్ రెడ్డి, వ్యవసాయ అధికారి కృష్ణ, నర్సంపేట తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో మంగళవారం ముందస్తు రంజాన్ పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పాఠశాల చిన్నారులు తమ మిత్రులకు ఈద్ ముబారక్ అంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఒకరికొకరు ఖర్జూరాలు పండ్లు సేమియాలు అందించి తమ ఆత్మీయ అనుబంధాన్ని చాటారు. మతసామరస్యానికి ప్రతీకగా పాఠశాలలో అన్ని తరగతుల విద్యార్థులు రంజాన్ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రపంచమంతటా మతసామరస్యాన్ని చాటుతూ రంజాన్ వేడుకలను నిర్వహించి తోటి మానవుల పట్ల తమ ఆదరాభిమానాలను ప్రదర్శించే పండుగ రంజాన్ పర్వదినం అని పేర్కొన్నారు. కఠోర ఉపవాసాన్ని ఆచరించి చివరి రోజు ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు. రంజాన్ మాసంలోనే పవిత్ర ఖురాన్ మత గ్రంథం దివి నుంచి భూమికి చేరిన పవిత్ర మాసం అని తెలియజేశారు. ఓర్పు,సహనం త్యాగనిరతి పరోపకారం దానధర్మ




భావనలు రంజాన్ పర్వదినం మనకి అందరికీ సందేశాన్ని ఇస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.





# అక్రమ మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** అక్రమ మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు.

మంగళవారం సారంగాపూర్ మండలంలోని జాం గ్రామ చెరువు సమీపంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల అవసరాల కోసం మొరం తవ్వకాలు చేపట్టాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా రెవెన్యూ అధికారుల అనుమతి పొందిన తర్వాత మాత్రమే తవ్వకాలు చేయాలని సూచించారు. అక్రమ మొరం తవ్వకాలపై రెవెన్యూ అధికారులు పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు.

మొరం, ఇసుక అక్రమ తవ్వకాలు చేసే వారిపై అలాగే అక్రమంగా రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మైనింగ్ అధికారి హరి ప్రసాద్, తహసిల్దార్ సంధ్యారాణి, రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వేంద్రియానం నయనం ప్రధానం

**-కంటిచూపు ప్రసాదించి**

**మరోసారి మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్**



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం నగరంలో సెయింట్ మేరీస్ వృద్ధుల ఆశ్రమం లో నివసిస్తున్న నిరుపేద అనాధ వృద్ధురాలైన మంగా కృష్ణకుమారి కి "వాసన్ ఐ కేర్ హాస్పిటల్" లో నిపుణులైన వైద్యులచే ఉచితంగా అన్ని రకాల పరీక్షలు సొంత ఖర్చులతో కంటి ఆపరేషన్ చేయించి ఉచితంగా కళ్ళజోళ్ళు మందులు ఐ డ్రాప్స్ అందజేసి మరోసారి మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్.

ఇటీవలే పల్లా కిరణ్ నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో ఈ వృద్ధురాలు వైద్య పరీక్షలు చేసుకొనగా వెంటనే డాక్టర్లు కంటి ఆపరేషన్ చేయించుకోవాలని సూచించగా నా అంటూ ఎవరూ లేని అభాగ్యురాలు పల్లా కిరణ్ ను సంప్రదించగా మానవతా దృక్పథంతో స్పందించి ఆపరేషన్ చేయించిన పల్లా కిరణ్.

గత 20 సంవత్సరాలుగా వివిధ వర్గాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు పల్లా కిరణ్.ఉదాహరణకు సంవత్సరానికి 2 రెండు సార్లు ఉచిత మోగా వైద్య శిబిరం నిర్వహించుట కరోనా సమయంలో 3000 మందికి మామిడికాయ పచ్చడి పంపిణీ, ప్రైవేటు టీచర్స్ మరియు పేదలకు బియ్యం నిత్యవసర సరుకులు పంపిణీ వరదల సమయంలో నిత్యం అందుబాటులో ఉంటూ వరద బాధితులకు ఆహారం, నీరు, నిత్యవసర సరుకులు మరియు బట్టలు పంపిణి ఇలా అన్ని వర్గాల ప్రజలకు అనేక సందర్భాల్లో అన్న దానాలు నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు ప్రాథమిక ఉన్నత విద్య కొరకు ఆర్థిక సహాయం వృద్ధులకు వికలాంగులకు, మహిళలకు అనాధ బాలబాలికలకు మరియు యువతకు నిత్యం అనేక విధాలుగా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తున్న పల్లా కిరణ్.

# ఇందిరమ్మ ఇళ్లు పేదల కలలకు ప్రతిరూపం

**- టీపీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి**

**నర్సంపేట అక్షిత ప్రతినిధి:** మండల కేంద్రానికి చెందిన పెరలా ఉమా – ఉపేందర్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో ఇందిరమ్మ పాలన ఆదర్శంగా సాగుతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డికి ఈ సందర్భంగా వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలని వారు పేర్కొన్నారు.

కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ,



మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు గుంటుపల్లి ప్రభాకర్ రావు, బత్తుల సుబ్బారెడ్డి, వజ్రాల వెంకట్ రెడ్డి, ముప్వ పిచ్చిరెడ్డి, మిన్నకంటి నవీన్ రావు తదితరులు పాల్గొన్నారు.



# రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

**అవసరమేరకే పురుగు మందులు వాడాలి: సర్పంచ్ కుమారస్వామి**

**భీమదేవరపల్లి, అక్షిత ప్రతినిధి:** రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలో నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ మరియు భారత సుస్థిర పత్తి యాజమాన్య పథకం ఆధ్వర్యంలో రైతులతో అవగాహన ర్యాలీ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గిస్తూ దిగుబడులు పెంచుకోవాలన్నారు. పురుగు మందులు అవసరమైతేనే వాడాలన్నారు. వాడేటప్పుడు రక్షణ దుస్తులు ధరించాల న్నారు. పర్యావరణానికి హాని కలిగించే పురుగు మందులు వాడరాదన్నారు. రైతులు పురుగు మందులకు బదులుగా కాషాయాన్ని వాడితే అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలయ్య బీసీఐ సమన్వయకర్తలు సాయి కిరణ్, తిరుపతి, రజిత, సోనీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో చేనేత కార్మికుడి మృతి

**చేనేత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం**

**మాజీ ఎంపీటీసీ మహేందర్ రెడ్డి పరామర్శ, 10,000 అందజేత**

**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** వెల్లంకి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు మిర్యాల బాలరాజు అప్పుల బాధతో మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని కలిగించింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ తిమ్మా



పురం మహేందర్ రెడ్డి బాలరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం కూడా స్పందించి తగిన సహాయం అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు అయిటిపాముల పెద్దులు, గంజి భాస్కర్, గోషిక కొండల్ రెడ్డి, గంజి నర్సింహ, చక్రపాణి, కొంగరి జానయ్య, పోచబోయిన నర్సింహ, రుద్ర వెంకటేష్, కొంగరి రామ్ మోహన్, గోధుమల సోమప్ప, కరేకంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పటిష్టతకు కృషి

**జిల్లా ఉపాధ్యక్షుడు కక్కునూరి**

**ఉపాధ్యక్షుడిగా కొత్తగా నియామకం**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** గ్రామీణ స్థాయి నుండి భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని రంగారెడ్డి రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు కక్కునూరి వెంకటేష్ గుప్తా అన్నారు. వెంకటేష్ గుప్తను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ ఆదేశాలు జారీ చేశారు ఈ మేరకు జిల్లా అధికార ప్రతినిధిగా పనిచేస్తూ వచ్చిన వెంకటేష్ గుప్తా ఇప్పుడు ఉపాధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత మాట్లాడుతూ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు అందరితో కలిసి పని చేస్తానని వెల్లడించారు. పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రధ ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభివృద్ధి క్రమాలను ప్రజల్లోకి తీసుకుపోతామని వివరించారు. అలాగే జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ఇసునాతి శ్రీనివాస్ ను మరియు జిల్లా కోశాధికారిగా ఎన్నికైన అమడపురం నర్సింహా గౌడ్ను పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందించారు.

# ఏదులాపురంలో రంజాన్ తోఫా పంపిణి చేసిన భూక్యా సురేష్ నాయక్

**ఖమ్మం /అక్షిత బ్యూరో:** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి లోని ముస్లిం సోదర సోదరిమనులకు రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పర్వదినం సందర్భంగా అందిస్తున్న తోఫా కిట్లు 30 వ వార్డు వరంగల్ క్రాస్ రోడ్ లోని మదర్ థెరిసా కాలనీలో పలు కుటుంబాలకి వెళ్ళి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి కిట్లను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారితో పాటు పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎన్పి చారీ మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు గణపారపు మధు భద్రాచారీ తదితరులు పాల్గొన్నారు.




# అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన శ్రావణి

### శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో ఘన సత్కారం

**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** ఇండోనేషియాలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విజయం సాధించి గోల్డ్ మెడల్ అందుకున్న దేవల్ల శ్రావణిని శ్రీహర్ష డిగ్రీ కళాశాల యాజమాన్యం మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించింది.




ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పల్లె భూమేష్ మాట్లాడుతూ, శ్రావణి కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసిస్తూ అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని విజయం సాధించడం ద్వారా భారతదేశ ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిచెప్పడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ఒలింపిక్ స్థాయిలో కూడా ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పోటు మనోహర్ రెడ్డి, తనుగుల శ్రావణ్, ప్రిన్సిపాల్ అరెల్లి అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మికుల డిమాండ్లు వెంటనే తీర్చాలి

### ఫిట్ కార్యదర్శి హరి రామకృష్ణ

**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** ఆర్కేపి సిహెచ్పి వద్ద ఫిట్ కార్యదర్శి హరి రామకృష్ణ ఆధ్వర్యంలో ద్వారా సమావేశం నిర్వహించారు. అనంతరం కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిహెచ్పి ఇన్‌చార్జ్ చంద్రమౌళికి తమ డిమాండ్లతో కూడిన మెమరండాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఫిట్ కార్యదర్శి మాట్లాడుతూ సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ముఖ్యంగా కార్మికుల పెర్క్స్‌పై పడుతున్న పన్నులను యాజమాన్యమే భరించాలని, సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకే కేటాయించాలని, స్ట్రక్చర్ కమిటీలో చర్చించిన అంశాలను సర్కులర్ రూపంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన రూ.50 వేల కోట్ల బకాయిని వెంటనే చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 19న రామకృష్ణపూర్ పట్టణంలో జాత కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.




ఈ కార్యక్రమాన్ని కార్మికులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మాదాసి వేణుగోపాల్, సిరాజుద్దీన్, మండల శ్రీనివాస్, చొప్పదండి స్వామి, సీతారామారావు, చంద్రు, మహేందర్, డొక్కు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రజిత, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.






# మానవత్వం ఉన్నచోట వివక్షత ఉండరాదు

### ట్రాంజెండర్ కమ్యూనిటీ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు కలిసి పని చేయాలి

### జిల్లా సంక్షేమ అధికారినులు రాజమణి,విశ్వజ

**వరంగల్, అక్షిత బ్యూరో:** మంగళవారం ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, మాస్ ఎన్జీవో సంయుక్తంగా సుబేదారిలోని అసంత భవన్‌లో సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన ప్రభుత్వ అధికారులు ట్రాంజెండర్ కమ్యూనిటీ వ్యక్తులతో వారి హక్కుల పరిరక్షణ స్వయం సమృద్ధి అనే అంశం పైన సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి రాజమణి మాట్లాడుతూ సమాజంలో పిల్లలు, మహిళలు, వృద్ధుల తర్వాత అత్యధికంగా సమాజంలో ట్రాంజెండర్ కమ్యూనిటీ అత్యధికంగా వివక్షతకు గురవుతున్నారని దీనిని పరిరక్షించడానికి 2019లో భారత ప్రభుత్వం ట్రాంజెండర్ పర్సన్స్ రక్షణా, హక్కుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు.

హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ఇప్పటివరకు 59 మంది ట్రాంజెండర్ ఐడెంటి కొరకు అప్లై చేసుకోవడం జరిగిందని వీరిలో వెరిఫికేషన్ తర్వాత జిల్లా కలెక్టర్ సహకారంతో వారికి గుర్తింపు కార్డులు అందజేస్తామని సూచించారు అదేవిధంగా ప్రభుత్వము వీరి కొరకు మూడు గుంటల స్థలాన్ని కేటాయించడం జరిగిందని దాని జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారికి ప్రత్యేక వసతి గృహాన్ని నిర్మించుటకు సహకరిస్తామని సూచించారు.

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ జే శ్యాం సుందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీరు కొరకు జిల్లాలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయడం జరిగిందని హెల్ప్ డెస్క్ ద్వారా ఆరు రకాల సేవలు అందించడం జరుగుతుందని కాబట్టి ట్రాంజెండర్ వ్యక్తులు ఈ యొక్క హెల్ప్ డెస్క్ ద్వారా వారికి ఎటువంటి ఇబ్బందులు కలిగిన తక్షణ సహాయ0 కొరకు వరంగల్ పోలీస్ కమిషనర్‌లో ఉన్న హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హాజరైన కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి వెంకన్న, రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ ,వి,శ్రీనివాస్,సైబర్ క్రైమ్ ఎస్సై చరణ్, ట్రాంజెండర్ లైలా మాట్లాడారు. వారి హక్కుల కోసం ప్రభుత్వం ప్రభుత్వ ఇతర సంస్థలు కలిసికట్టుగా పని చేయాలని ప్రజలకు ఇబ్బంది కలుగుతుందా ట్రాఫిక్ అంతరాయం లేకుండా వారు కూడా ప్రవర్తించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, సైబర్ క్రైమ్ ఎస్సై శివకుమార్, ఏ హెచ్ టి యు, ఎస్సై సుధాకర్, సంస్థ నుండి సుదర్శన్, అజయ్ కుమార్ తదితరులతోపాటు హనుమకొండ డిసిపిఓ, ఎస్ ప్రవీణ్ కుమార్, రవి కృష్ణ, అనిరుద్, ట్రాంజెండర్ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రైతన్నల కోసం దొంతి మాధవరెడ్డి చొరవ

### మక్కల కొనుగోలుకు మంత్రి తుమ్మల సానుకూలత

**నర్సంపేట, అక్షిత ప్రతినిధి:** నర్సంపేట నియోజకవర్గ రైతాంగ ప్రయోజనాలే ధ్యేయంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మరో ముందడుగు వేశారు. నియోజకవర్గంలోని రైతులు సాగు చేసిన మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో ఆయన రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో గట్టి ప్రయత్నం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే మాధవరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి, నియోజకవర్గంలోని పంట పరిస్థితిని వివరించారు.

సుమారు 78 వేల ఎకరాల్లో సాగైన మొక్కజొన్నను కొనుగోలు చేయడంలో ఆలస్యమైతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, తక్షణమే తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ సహకార సంస్థ (మార్క్ ఫెడ్) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మంత్రికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ రైతుల సమస్యలపై దొంతి మాధవరెడ్డి చూపిన ప్రత్యేక చొరవకు మంత్రి సానుకూలంగా స్పందించారు. నర్సంపేట మక్కల కొనుగోలుకు ప్రభుత్వం నుండి పూర్తిస్థాయి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి, రైతులకు భరోసా ఇచ్చారు.



రైతుల సమస్య ఏదైనా దొంతి మాధవరెడ్డి వెనువెంటనే స్పందిస్తారని, ఆయన నిరంతర కృషితోనే నేడు మక్కల కొనుగోలుకు మార్గం సుగమమైందని నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తెలిపారు. ఈ నిర్ణయంతో నియోజకవర్గంలోని వేలాది మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి మున్సిపాలిటీలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక

### వైద్య ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు ఉచిత వైద్యం

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెల 6వ తేదీ నుండి జూన్ నెల 12వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ కార్మికులు మరియు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడమైనది.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొన్నారు.



సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎండి రెహానా బేగం కమల్ పాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, అడిషనల్ డిఎంహెచ్ఓ చందు నాయక్, డాక్టర్ అవినాష్, మున్సిపల్ కమిషనర్ నరసింహ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు ఎండి నసీమా షరీఫ్,బండారు శరత్ చంద్ర, జగన్నాథం శ్రీను, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, మున్సిపల్ కార్మికులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నాగారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

**ఎమ్మెల్యే మందుల సామేలు ఇంటిపై దాడిని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన**

**దళిత ఎమ్మెల్యేపై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పు**

**మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పానుగంటి నరసింహారెడ్డి**



**నాగారం అక్షిత న్యూస్:** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించే తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు నివాసంపై బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ కార్యకర్తలు దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తూ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి నిరసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నాయకులు, కార్యకర్తలు తమ తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేశారు. దళిత ప్రజా ప్రతినిధిపై జరిగిన ఈ దాడి ప్రజాస్వామ్య వ్యవస్థపై నేరుగా దాడి జరిగినట్టేనని, ఇది రాజకీయ అసహనానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పానుగంటి నర సింహారెడ్డి మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన ఒక శాసన సభ్యుని నివాసంపై దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని, ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో చట్టం, శాంతిభద్రతల పరిస్థితి ఎంత దుర్భరంగా మారిందో స్పష్టంగా తెలియజేస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా దళిత వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధిని లక్ష్యంగా చేసుకొని దాడి జరగడం సామాజిక న్యాయానికి విరుద్ధమని, ఇది సమాజంలో అసహనాన్ని పెంచే చర్యగా తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను గౌరవించా ల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని మండిపడ్డారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఈ ఘటనపై వెంటనే సమగ్ర దర్యాప్తు జరిపి దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ లాభాల కోసం హింసకు పాల్పడడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని, ఇలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పోరాడుతుందని, దళితుల గౌరవం, హక్కులను కాపాడేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకట భిక్షం, ఎల్మకంటి సోమయ్య, నాగారం బంగ్లా సర్పంచ్ బయ్యం సుజాత వెంకన్న, ఈటూరు గ్రామ సర్పంచ్ వంగూరి దామోదర్, ఫణిగిరి దేవాలయ చైర్మన్, బంగ్లా ఉప సర్పంచ్ చీరిక నరేందర్ రెడ్డి, ఫణిగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కసిరెడ్డి రాంరెడ్డి, నాగారం బంగ్లా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొనిరెడ్డి మోహన్ రెడ్డి, ఈటూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన లింగయ్య,చిత్తలూరి వెంకన్న, అనంతుల వెంకటయ్య, గద్దల సైదులు, కొమ్ము యాకస్వామి, పాల్వాయి పరుషరాములు, బైరబోయిన సత్తయ్య, కంపాటి శేఖర్, బట్టు కొమిరెల్లి, వీరయ్య, అవిలయ్య, చారి, రామ్మూర్తి, రవి, శ్రీను, వీరన్న, నరేష్ రెడ్డి, ఉప్పలయ్య,యాదగిరి,కుమార్, యాదగిరి,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్‌లో పశువుల సంత ప్రారంభం


**గద్వాల,అక్షిత న్యూస్:** మల్దకల్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా రైతు సంబరాల ఆవరణలో మంగళవారం పశువుల సంత ప్రారంభమైంది. సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్ పశువుల సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం పశువులు మేకలు గొర్రెలు సంత జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రతి శనివారం గ్రామంలో కూరగాయల సంత యధావిధిగా జరుగుతుందని పశువులు గొర్రెల సంత లేనందున ఇక్కడ ఏర్పాటు చేసినట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వచ్చిన రైతులకు శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సంత ప్రారంభం రోజున అధిక సంఖ్యలో రైతులు తమ ఎద్దులను, గొర్రెలు, మేకలను



విక్రయించడానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డమీది సత్యమ్మ ఆంజనేయులు, ఈవో మాబి, వార్డు మెంబర్లు, రవిచారి, పట్వారి అనిల్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## పాలమూరు విశ్వవిద్యాలయ విద్యార్థులు క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** పాలమూరు విశ్వవిద్యాలయం నుండి ఇంటర్ యూనివర్సిటీలో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ తరపున పాల్గొనే విభాగంలో ఎంపికలకు పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ జిఎన్. శ్రీనివాస్ మరియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.రమేష్ బాబు హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించినారు.



ప్రొఫెసర్ జిఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడాకారులు పాలమూరు యూనివర్సిటీలో ఉన్నటువంటి క్రీడా సదుపాయాలను ఉపయోగించుకొని క్రీడల్లో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రదర్శన కనబరిచి మీయొక్క తల్లిదండ్రులకు, మీ గ్రామానికి మరియు మీరు చదువుతున్నటువంటి పాలమూరు విశ్వవిద్యాలయానికి ఒక ప్రత్యేకమైనటువంటి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే క్రీడలకు అవసరమైనటువంటి సదుపాయాలను యూనివర్సిటీ కల్పి స్తుందని కాబట్టి క్రీడాకారులు క్రీడల్లో పాల్గొని మంచి ఫలితాలను తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. పాలమూరు విశ్వవిద్యా లయం నుండి గత సంవత్సరము రాష్ట్రస్థాయిలో అర్చరీ లో బంగారు పతకము రావడం జరిగిందన్నారు అలాగే విద్యార్థిని విద్యార్థులు కష్టపడి మీకు ఇష్టమైనటువంటి క్రీడలలో రాణించి పాలమూరు విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ప్రొఫెసర్ పి.రమేష్ బాబు మాట్లాడుతూ పాలమూరు విశ్వవిద్యాల యంలో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో మంచిగా రానిస్తుండడం చాలా శుభ పరిణామం అని అన్నారు. ఈ మధ్యకాలంలోనే పాలమూరు విశ్వవిద్యాలయానికి రాష్ట్ర స్థాయిలో మంచి పథకాలు వచ్చాయని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26. నుండి 31 వరకు దేవేంగిరి యూనివర్సిటీ దేవేంగిరి కర్ణాటక లో నిర్వహించేటటువంటి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో పాల్గొంటుంది అని పాలమూర యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై శ్రీనివాసులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోకో ఇంచార్జ్ రజిని, ప్రొఫెసర్.సత్య భాస్కర్ రెడ్డి, కోకో అసోసియేషన్ సెక్రెటరీ ఆర్ బాలరాజయ్య, కోచ్లు, బి. రూప, తిరుమలేశ్, డా అరుణ్, యుగేందర్ డా గాలెన్న, తో పాటు క్రీడాకారులు పాల్గొనారు. ఈ ఎంపికల లో 8, టీమ్ లు పాల్గొన్నాయి ఇందులో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ ఎంపికలు అన్ని యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు జరిగాయి.



## పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం

**రామన్నపేట ఎస్ఐ డి.నాగరాజు**

**రంజాన్ పండుగ ముందు పోలీసుల సమావేశం**

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** రంజాన్ పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ సమావేశం జరిగింది. ఈ సంద ర్భంగా ఎస్ఐ డి.నాగరాజు మాట్లాడుతూ రంజాన్ పండుగను స్నేహ భావంతో, కులమత భేదాలు లేకుండా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులను కోరారు. అలాగే రంజాన్ తర్వాత వచ్చే ఉగాది, శ్రీరామనవమి పండు గలను కూడా అన్ని వర్గాల ప్రజలు కలిసి సామరస్యంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉప సర్పంచ్ రమేష్, ఎండీ అన్వర్, ఇతర కమిటీ సభ్యులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## తహసిల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి

**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శామీర్ పేట్ మండల తహసిల్దార్ కు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. వృద్ధులకు ఫించన్ పెంపు, గృహిణి మహిళలకు 2500, తులం బంగారం, రైతులకు రైతు భరోసా 5000 నుండి 7500 గా మారుస్తానని మాట తప్పారని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసా రంగా హామీలు ఇచ్చి తెలం గాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ మండల బీజేపీ అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ కైరా గణేష్, మాజీ సర్పంచ్ మామిళ్ల అశోక్, బీజేపీ నాయకులు బ్రహ్మానంద రెడ్డి, సిహెచ్. వెంకటేష్, గౌరారం రమేష్, భీమా నాయక్, పాక మల్లేష్, నాగరాజు ముదిరాజ్, జీవీకే యాదవ్, మహేష్ యాదవ్, డి చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## మేడ్చల్ నుండి విజయవాడ, ఒంగోలుకు బస్సు సౌకర్యం

**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** మేడ్చల్ నుండి విజయవాడ, ఒంగోలు కు బస్సు సర్వీసులు నడపడం జరుగుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ పరిమళ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి రోజూ వివిధ సమయాల్లో



బస్సులు అందుబాటులో ఉంటాయని ఆమె పేర్కొన్నారు. మేడ్చల్ నుండి విజయవాడకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో బస్సులు నడుస్తూ ప్రయాణికులకు సౌకర్యం కల్పించనున్నామని తెలిపారు. ప్రయాణికులు ముందుగానే తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకుని టిక్కెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు.